# నగర శివారులో ఆదిమానవుల ఆనవాళ్లు

● మేడ్చల్ జిల్లాలో కొన్నివందల ఏళ్ల నాటి రాతిచిత్రాలు ● మరిన్ని విశేషాలను గుర్తించిన పరిశోధకులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా, షామీర్‌పేట మండలం యాడారం గ్రామంలోని పెద్ద గుట్టపైనున్న ఆదిమానవుల ఆవాసాలను, ఆనాటి వర్ణచిత్రాలను పరిశీలించినట్లు ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. ద్యావనపల్లి సత్యనారాయణ 2017లో గుర్తించిన ఈ శిలాయుగపు స్థావరాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందంతో కలిసి తాను బుధవారం సందర్శించి మరిన్ని విషయాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. నాలుగు అంతస్తుల రాతి ఆవాసపు మూడో అంతస్తులో 60 అడుగుల ఎత్తులోని రెండు నిలువు రాతి బండలమీద సూక్ష్మరాతి యుగానికి (క్రీ.పూ 8,500) చెందిన మూపురం ఉన్న ఎద్దు, మూపురం లేని ఎద్దు, మనుషుల బొమ్మలను పరిశీలించినట్లు తెలిపారు. వీటితో పాటు కొత్త రాతియుగం (క్రీ.పూ 4000) ఎద్దు, నెమలి బొమ్మలు, ఇనుప యుగానికి చెందిన (క్రీ.పూ 1000) ముగ్గులను పోలిన రేఖాచిత్రాలు, చారిత్రక తొలియుగం (క్రీ.శ 1 నుంచి 2 మధ్యకాలం) శృంగార భంగిమలో నెలవైన మూడు జంటలు తదితర చిత్రాలను గమనించినట్లు వివరించారు. వీటి ద్వారా యాడారం గుట్ట సూక్ష్మరాతి యుగం నుంచి చారిత్రక తొలి యుగం వరకు ఆదిమానవులకు నివాస స్థలమని ద్యావనపల్లి పరిశోధనలో వెల్లడైన విషయాన్ని ఈమని శివనాగిరెడ్డి గుర్తు చేశారు. గుట్ట కింద సూక్ష్మరాతి యుగపు పనిముట్లు, కొత్త రాతియుగంలో రాతిగొడ్డళ్లను అరగదీసిన గుంటలు, ఇనుప యుగంనాటి సమాధి ఆనవాళ్లు... ఈ రేఖా చిత్రాల పురా చరిత్రకు ఆధారమని, వాటిని కాపాడుకోవాలని స్థానికులకు సూచించారు. కొన్నివందల ఏళ్ళ చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ఈ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చని ఈమని శివనాగిరెడ్డి సూచించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యులు మహమ్మద్ నసీరుద్దీన్, అహోబిలం కరుణాకర్‌తో పాటు కొందరు స్థానికులు పాల్గొన్నారు.


యాడారం గుట్టమీద ఆదిమానవుల ఆనవాళ్లను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి, కొత్త తెలంగాణ బృందం


మాట్లాడుతున్న పి.రాజేశ్వర్

## పార్లమెంటు ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని వీరో కె వీర్ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేశ్వర్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఐదు స్థానాలకు అభ్యర్థులను అధిష్ఠానం ఖరారు చేసిందన్నారు. గుజరాత్ రాష్ట్రం సూరత్ కేంద్రంగా మాజీ సైనికుడు లాల్జీబాయి బాదర్ ఈ పార్టీని ఏర్పాటు చేశారన్నారు. నల్గొండ అభ్యర్థిగా పెదమాను సైదులు, నిజామాబాద్ నుంచి పి.రాజేశ్వర్, చేవెళ్ల నుంచి పి.పెంటారెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి పి.సత్యనారాయణ, మహబూబ్‌నగర్ నుంచి ఎం.రామకృష్ణారెడ్డిని ఎంపిక చేసిందన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఫౌండర్, చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

## వైభవంగా పెద్దమ్మతల్లి వార్షిక రథోత్సవం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి 30వ వార్షిక రథోత్సవ వేడుకలు బుధవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, పంచగ్రవ్య ప్రాశన, ధ్వజారోహణం, చండీపారాయణాలు, వేదపారాయణాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. ఈనెల 16న రథసప్తమిని పురస్కరించుకొని అమ్మవారికి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్, చైర్మన్ పి.విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## రేపు డాన్‌బాస్కో జాబ్‌మేళా

సనత్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్, నేషనల్ కేరీర్ సర్వీసెస్, డాన్‌బాస్కో సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇవాన్ వాజ్ తెలిపారు. పలు సంస్థల ప్రతినిధులు సనత్‌నగర్ సెంట్ థెరిసా చర్చి ప్రాంగణంలో ఉయదం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభిస్తారని, డిగ్రీ, డిప్లొమా, బీఎస్సీ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు దీపక్‌రెడ్డి

## శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించాలి

బోరబండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న జరిగే ఛత్రపతి శివాజీ జయంత్రిని ఘనంగా నిర్వహించాలని జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. బోరబండ సాయిబాబా ఆలయంలో డివిజన్ ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మోతీనగర్ కూడలి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బోరబండ బస్టాప్ వరకూ శోభాయాత్ర ఉంటుందన్నారు. సమావేశంలో నాయకలు కొత్త వెంకటేశ్, బి.సురేష్‌గౌడ్, కృష్ణ మోహన్, దర్శనం నగేశ్, చింటు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం చోరీకి గురయింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-4లో కజారియా టైల్స్‌లో మేనేజర్‌గా పని చేసే వెల్దండ కీర్తన ఈనెల 13న తన స్కూటీపై రోడ్డు నెంబరు 7లోని కజారియా టైల్స్ షోరూంకు వచ్చింది. వాహనాన్ని పార్కింగ్‌లో పెట్టి తన పని ముగించుకొని గంట తరువాత బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. అన్ని ప్రాంతాల్లో వెతికినా ద్విచక్ర వాహనం జాడ లభించలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

● మధురానగర్‌లో..

యూసుఫ్‌గూడ: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురానగర్‌కు చెందిన బి.మహేష్ చార్టెడ్ అకౌంట్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 10వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో తన బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు మధ్యాహ్నం 3 గంటలకు బయటకు వెళ్లేందుకు బైక్ వద్దకు వచ్చాడు. కానీ అతడి బైక్ కనిపించలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవటంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోంది


పాదయాత్ర చేస్తున్న సీపీ వేణుగోపాలస్వామి

అమీర్‌పేట, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్‌జోడో యాత్ర వల్ల కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నేత సీపీ వేణుగోపాలస్వామి అన్నారు. బుధవారం ఆయన అమీర్‌పేట డివిజన్‌లోని బల్కంపేట తదితర ప్రాంతాల్లో కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రకు మద్దతుగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో పాదయాత్రలు నిర్వహిస్తున్నమన్నారు. ఈసారి ఈ పార్లమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. తాము కాంగ్రెస్ ఫర్ సికింద్రాబాద్ అనే నినాదంతో కూడిన వాలంటరీ సంస్థను ఏర్పాటు చేసామని, దీని ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తున్నమన్నారు. ఈ యాత్రలో హర్ష, గౌరీ, రంగారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టీజీవో నేతలు

## వాటర్‌బోర్డులో టీజీవో సభ్యత్వ నమోదు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ కమిటీ సూచనల మేరకు ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో టీజీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని టీజీవో హైదరాబాద్ జిల్లా సెక్రటరీ మహమ్మద్ ఖాదర్ బుధవారం ప్రారంభించారు. వాటర్‌బోర్డులో ఉన్న గెజిటెడ్ ఆఫీసర్లు అందరూ సభ్యత్వం పొందారని, వారందరికీ రశీదు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంలు సరస్వతి, చంద్రజ్యోతి, కేదారేశ్వరి, సుగంధిని, టీజీవో జలమండలి శాఖ ఈసీ మెంబర్లు రమేశ్‌బాబు, ఉత్తమ్‌సింగ్, భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 18న 4వ జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రుద్రమదేవి మెగాకప్ 4వ ఓపెన్ జాతీయ కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్‌స్టేడియంలో ఈనెల 18 నిర్వహించనున్నారు. 14 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొననున్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వి.చిన్న శ్రీశైలంయాదవ్, నిర్వాహకులతో కలిసి విజేతలకు ఇవ్వనున్న మెడల్స్‌ను విడుదల చేశారు. కరాటే మాస్టర్‌గా సినిమాలో కరాటే ఉంటేనే సినిమాలు ఒప్పుకోవడం లాంటివి చేశానని నటుడు సుమన్ అన్నారు. పోటీలో పాల్గొని టాలెంట్ నిరూపించుకోవాలన్నారు. ఆత్మరక్షణ కోసం అందరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని, ముఖ్యంగా అమ్మాయిలు కరాటే నేర్చుకోవడం ముఖ్యమన్నారు. సమావేశంలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు లక్ష్మీసామ్రాజ్యం, పోటీల చీఫ్ ఆర్గనైజర్ డాక్టర్ రవి పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ హత్యకేసు.. పోలీసుల అదుపులో రౌడీషీటర్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రియల్టర్, బీజేపీ నాయకుడు సింగోడి రాము హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన రౌడీషీటర్ జిలానీని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రాముపై పగతో మణికంఠ హత్య చేసేందుకు పథకం వేయగా రౌడీషీటర్ జిలానీ తన మనుషులతో పాల్గొన్నాడు. హత్య అనంతరం జిలానీ అక్కడి నుంచి పారిపోయాడు. అతని మనుషులు మాత్రం పోలీసులకు దొరికారు. గతంలో కూడా అనేక హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న జిలానీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ హత్యలో ఏ8గా ఉన్న జీడిమెట్లకు చెందిన గణపతిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## బంగారంతో ఆయుర్వేద మందు చేసిస్తానని మోసం

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బంగారంతో ఆయుర్వేద మందు తయారీ చేసి ఇస్తానని నమ్మించి ఓ మహిళ నుంచి లక్షల రూపాయల నగదు కాజేసి వైద్యుడు పరారయ్యాడు. ఈ సంఘటన మదురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోతీనగర్ ప్రాంతానికి చెందిన వాసా చాయాదేవి 20 ఏళ్లుగా వెన్నెముక, పేగు, మూత్రాశయం తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. తమ ఇంటికి సమీపంలో నివసించే ఓ వ్యక్తి వెంగళరావునగర్‌లో ధన్వంతరి ఆయుర్వేద కేంద్రం ఉందని, అక్కడ వైద్యం చేయించుకుంటే ఈ తరహా సమస్యలు తగ్గుతాయని నమ్మబలికాడు. దీంతో ఆమె గతేడాది నవంబర్ నెలలో ధన్వంతరి ఆయుర్వేద కేంద్రానికి వెళ్లింది. అక్కడ ఆనంద్ అనే వ్యక్తి ఆమెను పరీక్షించి బంగారంతో మందు తయారు చేసి వాడితే తప్పకుండా ఆరోగ్య సమస్యలు కుదుటపడతాయని తెలిపారు. రోగాలు తగ్గని పక్షంలో మీరిచ్చిన నగదుకు మరింతగా తిరిగి ఇస్తానని నమ్మబలికాడు. దీంతో చాయాదేవి లక్షన్నర విలువ చేసే మూడు తులాల బంగారం, మరో రూ.1.70 లక్షల చెక్కు ఇచ్చింది. కొద్ది రోజుల తర్వాత స్వర్ణ భస్మచూర్ణం తయారు చేయాలని మరో రూ.1.30 లక్షలు నగదు తీసుకున్నాడు. అనంతరం హిరాయుక్తరాస్ పేరుతో మరో మందు కొనుగోలు చేయాలని మరో రూ.3.50 లక్షలు తీసుకుని మందులు ఇచ్చాడు. ఐతే మూడు నెలలు గడిచినా ఎలాంటి ఫలితం లేకపోవటంతో ఆమె మంగళవారం మధురానగర్‌లోని ధన్వంతరీ ఆయుర్వేద కేంద్రానికి వెళ్లింది. అక్కడ ఆయుర్వేద వైద్యశాల కనిపించలేదు. చుట్టుపక్కల వారిని విచారించగా దుకాణం తీసి వేశారని తెలిసింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన చాయాదేవి మదురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా కొద్దిరోజుల క్రితం కోకాపేటకు చెందిన సబిచన్‌గుప్తా కూడా ఆనంద్ బంగారంతో మందులు చేసి ఇస్తానని మోసం చేశాడని కేసు పెట్టిన సంఘటన విదితమే. ఇంకా ఎందరు ఆనంద్ బారిన పడినవారు ఉన్నారో తెలియాల్సి ఉంది.

## పంజాగుట్టలో నడుస్తున్న కారులో మంటలు

### భారీగా ట్రాఫిక్ జామ్


మంటల్లో కాలిపోతున్న కారు

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్-పంజాగుట్ట ప్రధాన రహదారిలో నడుస్తున్న కారులో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారును నడుపుతున్న వ్యక్తి ప్రమాదాన్ని గుర్తించి వెంటనే దిగిపోయాడు. క్షణాల్లో మంటలు కారు అంతా వ్యాపించడంతో కాలిపోయింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన షేక్ సికిందర్ మీరాసాబ్ ఉపాధి నిమిత్తం గత సంవత్సరం నగరానికి వచ్చి ఆసిఫ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. రెండు నెలల క్రితం యూసుఫ్‌గూడకు చెందిన సయ్యద్ యూనస్ వద్ద నుంచి మారుతీ సుజుకీ రిట్జ్ (టీఎస్07యుఏ9570)కారును అద్దెకు తీసుకున్నాడు. ఓలాలో కారును రిజిస్టర్ చేసుకుని నడుపుతున్నాడు. బుధవారం బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్ సమీపంలోని ఓ ఆసుపత్రి వద్ద ముగ్గురు ప్రయాణికులను ఎక్కించుకుని నిజాంపేట్‌లో డ్రాప్ చేయడానికి పంజాగుట్ట ప్రధాన రహదారి మీదుగా వెళుతున్నాడు.ప్రధాన రహదారిలోని ఓ బట్టల షోరూమ్ వద్దకు రాగానే ఒక్కసారిగా కారులో చిన్న మంటలు వచ్చాయి.వెంటనే అప్రమత్తమైన రోడ్డుకు ఎడమవైపు కారు ఆపి ప్రయాణికులతో సహా కారు దిగిపోయాడు. కొద్ది నిమిషాల్లోనే ఏసీ కిటికీ నుంచి మంటలు రావడంతో అది కారు మొత్తానికి వ్యాపించి,కారు పూర్తిగా కాలిపోయింది.దీంతో ఖైరతాబాద్, పంజాగుట్ట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు రహదారిపై నుంచి ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. షేక్ సికిందర్ మీరాసాబ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాత్రి అదృశ్యం.. ఉదయం నాలాలో మృతదేహం

● బాలుడి మృతిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు


కార్తిక్ (ఫైల్)

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటున్న బాలుడు రాత్రి ఆదృశ్యమయ్యాడు. మరుసటి రోజు సమీపంలోని ఓ నాలాలో మృతదేహం లభించింది. జూబ్లీహిల్స్ రోడ్డునం.5 దుర్గాభవానీనగర్ బస్తీలో మునావత్ కవిత, రమేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఎం.కార్తిక్(11) జవహర్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ నెల13న బస్తీలో పిల్లలతో కలిసి కార్తిక్ ఆడుకుంటూ రాత్రి 8 గంటల తరువాత కనిపించకుండా పోయాడు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. బుధవారం ఉదయం బస్తీకి ఆనుకొని ఉన్న జీహెచ్ఎంసీ పార్కు వద్దగల నాలాలో పరిశీలించగా కార్తిక్ మృతదేహం లభించింది. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫైనాన్స్ కంపెనీకి రూ.40 లక్షల టోపీ

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న ఓ ఫైనాన్స్ కంపెనీకి రూ.40 లక్షలు కన్నం వేసి బ్యాంక్ మేనేజర్ పరారైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిద్దిపేట జిల్లా కొండపాక మండల సిరిసింగసెల్ల ప్రాంతానికి చెందిన తాటిపాముల శ్రీనివాస్ అనే వ్యక్తి బోయిన్‌పల్లి ఆర్య సమాజ్ సమీపంలో ఉన్న స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్‌లో క్లస్టర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ బ్యాంకులో డ్వాక్రా మహిళలకు రుణాలు ఇస్తుంటారు. ఈ క్రమంలో ఈ బ్రాంచి మేనేజర్‌గా ఉన్న తాటిపాముల శ్రీనివాస్ రుణాలు ఇస్తూ వాటిని సక్రమంగానే వసూలు చేస్తున్నాడు. వారు చెల్లిస్తున్న సుమారు రూ.30 లక్షల వడ్డీ కానీ అసలు కానీ నెలనెలా చెల్లిస్తున్న ఇన్‌స్టాల్‌మెంట్లు కానీ బ్యాంకులో జమచేయలేదు. దీనికి తోడు బ్యాంకుకు సంబంధించిన రూ.10లక్షలు బ్యాంకులో నుంచి తీసుకుని వెళ్లిపోయాడు. మూడు రోజులుగా బ్యాంకుకు రాకపోవడం, అతని ఫోన్ పనిచేయకపోవడంతో అనుమానం వచ్చి పై అధికారులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## శ్రీలేఖలు కవితా సంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటిని అవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, సుమన్

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యవంతం చేసేది సాహిత్యం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రవీణ్ శ్రీ రాసిన శ్రీలేఖలు కవితా సంపుటిని ప్రముఖ సినీనటుడు సుమన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. సాహిత్యం అనేక రూపాలుగా వస్తోందని ఆర్.కృష్ణయ్య అన్నారు. కవిత్వం సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తుందన్నారు. సాహిత్యకారులు, రచయితలు సమాజానికి దిక్సూచిగా పని చేయాలని, మార్పుకోసం అవసరమైన రచనలు చేయాలని సూచించారు. ఇది సామాజిక, నైతిక బాధ్యతగా భావించాలన్నారు. సినీ గీత రచయిత సిరాశ్రీ మాట్లాడుతూ.. వసంత పంచమి, ప్రేమికుల దినం సందర్భంగా 80కి పైగా కవితలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీపీ ఆర్.ఎస్.వి బద్రీనాథ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ఎస్.కే షిరాజ్, సినీనటుడు అభిలాష్ శంకర్, వి.చిన్న శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

## గుండె జబ్బులపై అవగాహనకు 'ది బ్రౌన్ హార్ట్'


నిర్మల్ జోషికి మెమొంటో అందచేస్తున్న విరించి ఆసుపత్రి నిర్వాహకులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులతో బాధపడుతున్న భారతీయులలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో 'ది బ్రౌన్ హార్ట్' డాక్యుమెంటరీ చిత్రీకరిస్తున్నట్లు ఇండో అమెరికన్ ఫిల్మ్‌మేకర్, ఫిజీషియన్ డాక్టర్ నిర్మల్ జోషి తెలిపారు. బంజారాహిల్స్ విరించి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతీక్ భట్నాగర్‌తో కలిసి ఆయన బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల్ జోషి మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోని అత్యుత్తమ వైద్యులను కలిగి ఉందని, ఏ దేశంలో పనిచేసినా దేశానికి కీర్తిప్రతిష్ఠలు తెస్తున్నారన్నారు. బ్రౌన్ హార్ట్ కాన్సెప్ట్ అనేక జీవితాలను ఏకకాలంలో ప్రభావితం చేసే చాలా పెద్ద పని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయులకు వచ్చే గుండెపోటులో 50 శాతం 50 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో వస్తుందన్నారు. భారతీయులలో గుండె జబ్బులు ఇతరులతో పోల్స్తే 2 నుంచి 4 రెట్లు అధికంగా ఉన్నాయన్నారు. 19, 25, 30 ఏళ్ల ఉన్న వారు గుండెపోటుతో ఆకస్మికంగా మరణిస్తున్నారని తెలిపారు. ఇలాంటి మరణాలు భవిష్యత్‌లో సంభవించకుండా ఉండేందుకు డాక్యుమెంటరీని నిర్మిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ మాట్లాడుతూ ప్రామాణిక కేసులలో ఒక శాతం కంటే తక్కువ రిస్క్‌తో చేసిన గుండె సర్జరీ ఇప్పటికే రోగులలో జీవన నాణ్యత పరిమాణాన్ని మెరుగుపరుస్తుందన్నారు.

## 'ఉస్మానియా' రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీ వేయాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని, జీవో 313ని అమలు చేయాలని ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి పరిరక్షణ గ్రూపు ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రిని పరిరక్షించాలని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రూపు ప్రతినిధులు అనురాధ రెడ్డి, డాక్టర్ జస్వీన్ జైరత్, సారా మాథ్యూస్, డాక్టర్ ఇక్బాల్ జావీద్, డాక్టర్ ఆసీఫ్ హనీఫ్ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు చేపట్టి వైద్య సేవలు కొనసాగించాలన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనాన్ని అలానే ఉంచి, ఖాళీగా ఉన్న ప్రదేశంలో అధునాతన వసతులతో కొత్త భవనం నిర్మించాలని వారు సూచించారు.

## జీహెచ్ఎంసీలో కదిలిన కుర్చీలు

### పాతుకుపోయినవారికి స్థానచలనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో ఎన్నోఏళ్లుగా పాతుకుపోయిన డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కలిగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీలు చేయగా, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒకే స్థానంలో ఏళ్లతరబడి ఉన్న పదిమందిని బదిలీ చేశారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని నియమించారు. ఏశైలజ, ఎండీ షేక్, డీ.సుభాష్‌రావులకు పోస్టింగ్ ఇవ్వలేదు.

| పేరు | ప్రస్తుతం పని చేస్తున్న స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| జకీయ సుల్తానా | డీప్యూటీ సీఈఓ | సర్కిల్-4, ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్ |
| ఎ.సుజాత | సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ | సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ |
| సీహెచ్.నాగేశ్వరరావు | రామగుండం, మున్సిపల్ కమిషనర్ | సర్కిల్-12, మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్ |
| జి.వేణుగోపాల్ రెడ్డి | బోడుప్పల్, మున్సిపల్ కమిషనర్ | సర్కిల్-29, సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ |
| శివకుమార్ | డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్, జీహెచ్ఎంసీ | సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ |
| ఎస్.విద్యాధర్ | గజ్వేల్, మున్సిపల్ కమిషనర్ | సర్కిల్-14, గోషామహల్ డిప్యూటీ కమిషనర్ |
| వి.సమ్మయ్య | తెల్లాపూర్, డిప్యూటీ కమిషనర్ | సర్కిల్-30, బేగంపేట డిప్యూటీ కమిషనర్ |
| ఖాదర్ మొయినుద్దీన్ | వెయిటింగ్ | సర్కిల్-15, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ |
| తిప్పర్తి యాదయ్య | ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ | సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ |
| జి.ఆంజనేయులు | డిప్యూటీ కమిషనర్, జీహెచ్ఎంసీ | సర్కిల్-2, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ |
| టి.దశరథ | సర్కిల్-4, ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్ | జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్ |
| పి.రవీందర్‌కుమార్ | సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ | జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్ |
| సీహెచ్.అరుణకుమారి | సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ | జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్ |
| ఎ.నాగమణి | సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ | జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్ |

## బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశా..

### నేడు బీజేపీలో చేరుతున్నా: పీఎల్ శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

పంజాగుట్ట, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, తనవంతు భాగస్వామ్యం కోసం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరుతున్నట్లు సీనియర్ నాయకుడు పీ.ఎల్ శ్రీనివాస్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో యువత, మహిళలను చైతన్యపరిచి పార్టీని అధికారంలోకి తేవడానికి కృషి చేస్తానని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల ఆడిటోరియంలో కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.లక్ష్మణ్ ఆధ్వర్యంలో తనతో పాటు తన కూతురు అలేఖ్య, పలువురు అనుచరులతో కలిసి బీజేపీలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు.

## కారు ఢీకొని చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మృతి

కొత్తపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సాదిక్‌అలీ(40) మృతి చెందగా, నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలి మొయినుద్దీన్(52)కు గాయాలయ్యాయి. ఎల్‌బీనగర్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన మహ్మద్ సాదిక్‌అలీ మలక్‌పేట ఏ- బ్లాక్ క్వార్టర్స్‌లో ఉంటూ చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలి మొయినుద్దీన్ కూడా ఏ- బ్లాక్‌లోనే ఉంటున్నారు. ఇద్దరూ కలిసి మంగళవారం రాత్రి 11.40 గంటలకు బైకుపై మలక్‌పేటకు బయలుదేరారు. సరూర్‌నగర్ స్టేడియం వద్ద వేగంగా వచ్చిన కారు వారి బైకును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సాదిక్ అలీని ఆస్పత్రికి తరలిస్తుంగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

## ఘనంగా వసంత పంచమి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సనత్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సనతనగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని సరస్వతి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారని నిర్వాహకులు తెలిపారు. దేవాలయం కార్యనిర్వహణాధికారి ఇ శ్రీనివాస రాజు, ముఖ్య అర్చకులు పారాశరం రవీంద్రాచార్యులు, అర్చకులు గోపాలజోషి భక్తులు పాల్గొన్నారు.

● యూసుఫ్‌గూడలో..

కృష్ణానగర్‌లోని సాయిసరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం నిర్వహించారు.

ఖైరతాబాద్: వసంత పంచమి సందర్భంగా ఖైరతాబాద్ సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలోని సరస్వతీ ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోమం, విశేష పూజలు జరిగాయి. చిన్నారులకు అక్షరాభ్యాసం వేడుకగా జరిగింది.



నల్గొండ సభ నుంచి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై స్వల్పంగా గాయపడిన ఎమ్మెల్యే లాస్య నందితను బుధవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అశోక్‌నగర్‌లోని ఆమె స్వగృహంలో పరామర్శించారు. - సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



కార్పొరేటర్లు, అధికారులతో సమావేశంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్

## మౌలిక సదుపాయాల మెరుగుపై జోనల్ కమిషనర్ ప్రత్యేక సమావేశం

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ జోన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల మెరుగుకు, అభివృద్ధి పనులు చేపట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరించవలసిన విధానంపై బుధవారం ఆయా విభాగాల అధికారులు, కార్పొరేటర్లతో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ, రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, తాగునీటి సరఫరా మెరుగు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, కె.హేమలత, సునీత, మహేశ్వరి, వై.అమృత, కె.ఉమారాణి, వి.శ్రవణ్ పాల్గొన్నారు.

## ఫైనాన్స్ కంపెనీకి రూ.40లక్షల టోపీ

**బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** తాను పనిచేస్తున్న ఓ ఫైనాన్స్ కంపెనీకి రూ.40లక్షలు కన్నం వేసి బ్యాంక్ మేనేజర్ పరారైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కొండపాక మండల సిరిసింగసెల్ల ప్రాంతానికి చెందిన తాటిపాముల శ్రీనివాస్ అనే వ్యక్తి బోయిన్‌పల్లి ఆర్యసమాజ్ సమీపంలో ఉన్న స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్‌లో క్లస్టర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ బ్యాంకులో డ్వాక్రా రుణాలు మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తుంటారు. ఈ క్రమంలో ఈ బ్రాంచి మేనేజర్‌గా ఉన్న తాటిపాముల శ్రీనివాస్ కొంత కాలంగా రుణాలు ఇస్తూ వాటిని మహిళల వద్ద నుంచి సక్రమంగానే వసూలు చేస్తున్నాడు. వారు చెల్లిస్తున్న సుమారు రూ.30 లక్షల వడ్డీ కానీ అసలు కానీ నెలనెలా చెల్లిస్తున్న ఇన్‌స్టాల్‌మెంట్‌లు కానీ బ్యాంకులో జమచేయలేదు. దీనికి తోడు బ్యాంకుకు సంబంధించిన రూ.10లక్షలు బ్యాంకులో నుంచి తీసుకుని వెళ్లిపోయాడు. మూడు రోజులుగా బ్యాంకుకు రాకపోవడంతో అతని ఫోన్ పనిచేయకపోవడంతో అనుమానం వచ్చి పై అధికారులు బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. చీటింగ్ కేసు కింద నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## యువతిని కాపాడి, తల్లికి అప్పగించిన పోలీసులు

**రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** కనిపించకుండా పోయిన యువతిని రాంగోపాల్‌పేట్ పోలీసులు 24గంటల్లో కాపాడి తల్లికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీజీ రోడ్డులోని సింధీకాలనీలో నివసించే హరినాక్షి గొండాలియా(19)కు కొంత కాలంగా మానసిక స్థితి సరిగ్గా లేదు. మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి, హుమాయున్‌నగర్, అత్తాపూర్ ప్రాంతంలో స్థానిక మీడియా మిత్రుల సహకారంతో యువతిని రక్షించి తల్లికి అప్పగించారు. మానసిక స్థితి సరిగ్గా లేని యువతిని సురక్షితంగా కాపాడిన రాంగోపాల్‌పేట్ పోలీసులను ఉత్తర మండల డీసీపీ రోహిణి అభినందించారు.

## రాత్రి అదృశ్యం.. ఉదయం నాలాలో మృతదేహం

● బాలుడి మృతిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఎం కార్తిక్ (ఫైల్)

**బంజారాహిల్స్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** ఇంటిముందు ఆడుకుంటున్న బాలుడు రాత్రి అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు సమీపంలోని ఓ నాలాలో మృతదేహం లభించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నం. 5 దుర్గాభవానీనగర్ బస్తీలో మునావత్ కవిత, రమేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఎం.కార్తిక్(11) జవహర్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 13న బస్తీలో పిల్లలతో కలిసి కార్తిక్ ఆడుకుంటూ రాత్రి 8 గంటల తరువాత కనిపించకుండా పోయాడు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. బుధవారం ఉదయం బస్తీకి ఆనుకొని ఉన్న జీహెచ్ఎంసీ పార్కులో నుంచి వెళుతున్న నాలాలో పరిశీలించగా కార్తిక్ మృతదేహం లభించింది. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


## కారు ఢీకొని చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మృతి

● నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐకి గాయాలు



మహ్మద్ సాదిక్ అలీ (ఫైల్)

**కొత్తపేట :** ఎల్‌బీనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సాదిక్‌అలీ(40) మృతి చెందగా, నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలి మొయినుద్దీన్(52) కు గాయాలయ్యాయి. ఎల్‌బీనగర్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన మహ్మద్ సాదిక్‌అలీ మలక్‌పేట ఏ- బ్లాక్ క్వార్టర్స్‌లో ఉంటూ చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ ఐ ఖాజావలి మొయినుద్దీన్ కూడా ఏ- బ్లాక్‌లోనే ఉంటున్నా రు. ఇద్దరూ కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై ఎల్‌బీనగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి 11.40 గంటలకు తిరిగి బైకుపై మలక్‌పేటకు బయలుదేరారు. సరూర్‌నగర్ స్టేడియం వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న కారు వారి బైకును ఢీకొట్టింది. బైకు నడిపిన సాదిక్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి, వెనుక కూర్చున్న ఖాజావలీకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాదిక్‌అలీ, ఖాజావలీలను 108 వాహనంలో ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ సాదిక్‌అలీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తెలిపారు. ఎస్ఐ ఖాజావలి చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు ఎండీ అబ్దుల్ అలీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పరారయ్యాడు.



చికిత్స పొందుతున్న ఖాజావలి మొయినుద్దీన్

## జూబ్లీహిల్స్ హత్య కేసు.. పోలీసు అదుపులో రౌడీషీటర్ జిలాని

**బంజారాహిల్స్ :** రియాల్టర్, బీజేపీ నాయకుడు సింగోడి రాము హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన రౌడీషీటర్ జిలానీని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. రాముపై పగతో మణికంఠ హత్య చేసేందుకు పథకం వేయగా రౌడీషీటర్ జిలానీ తన మనుషులతో పాల్గొన్నాడు. హత్య అనంతరం జిలాని అక్కడి నుంచి పారిపోయాడు. అతని మనుషులు మాత్రం పోలీసులకు దొరికారు. గతంలో కూడా అనేక హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న జిలానీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ హత్యలో ఏ8గా ఉన్న జీడిమెట్లకు చెందిన గణపతిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



నారాయణ హైస్కూల్‌లో వసంత పంచమి వేడుకల్లో ఉపాధ్యాయులు



ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వోన్నత పాఠశాలలో సరస్వతి పూజలు చేస్తున్న టీచర్లు, విద్యార్థులు



జ్ఞాన సరస్వతి ఆలయంలో అక్షరాభ్యాసానికి హాజరైన భక్తులు

# ఘనంగా వసంత పంచమి వేడుకలు

**పద్మారావునగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** వసంత పంచమి వేడుకలను గాంధీ ఆస్పత్రి ఎదురుగా గల జ్ఞాన సరస్వతి ఆలయంలో బుధ వారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వసంత పంచమిని పురస్కరించుకొని హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయ ప్రత్యేక మండపంలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమానికి వందల సంఖ్యలో భక్తులు తమ చిన్నారులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నగరం నుంచే కాక తెలంగాణలోని అనేక జిల్లాలకు చెందిన భక్తులు హాజరవడం విశేషం. కార్యక్రమానికి వచ్చిన అశేష భక్త జనసందోహంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

**కుమ్మరిగూడలో..**

**రెజిమెంటల్‌బజార్ :** మోండా డివిజన్ కుమ్మరిగూడలో ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా క్షీరాభిషేకం నిర్వహించారు. బొగ్గారపు విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ఎస్ కుమారి,వీరలక్ష్మి, అన్నపూర్ణ, సత్సంగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**రాంగోపాల్‌పేట్ :** విద్య ఉంటే ఉన్నతంగా జీవించవచ్చని గుండా ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న అన్నారు. బుధవారం వసంత పంచమి సందర్భంగా పాఠశాలలో గల సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యవాణి, కల్పన, ధరమ్ శీల, సుశీలబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**బౌద్ధనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రజాసమస్యలను పరిష్కరిస్తామని సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం బౌద్ధనగర్ డివిజన్‌లోని పార్శీగుట్ట సంజీవపురం, ఎల్.నారాయణనగర్‌లో రూ.పన్నెండు లక్షలతో నూతనంగా ఏర్పాటుచేసిన పవర్‌బోర్‌వెల్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ గతంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు, తదితర సంక్షేమాలను అందజేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఇప్పుడు ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పక్కదోవ పట్టిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటు ఖాయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పీ.రవిప్రసాద్‌గౌడ్, మేకల కీర్తి, శారదామల్లేష్, హన్మంతు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ



ముత్యాలమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, జంపన ప్రతాప్

**బోయినపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** కంటోన్మెంట్ ప్రాంతంలోని బోయినపల్లి బాపూజీనగర్‌లో ముత్యాలమ్మ ఆలయ పునఃనిర్మాణం జరిగింది. ఈ నేపథ్యంలో మూడురోజులపాటు ఆలయ ప్రాంగణంలో జరిగిన నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవ పూజలు, ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు సికింద్రాబాద్ మహంకాళి ఆలయం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ వేణుమాధవశర్మ వేద పండితుల బృందం చేతులమీదుగా ఆలయ ఛైర్మన్ జంపన ప్రతాప్, ఆలయ ప్రెసిడెంట్ దుర్గయ్య ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో బుధవారం కనుల పండగగా ఉత్సవాల ముగింపు, ముత్యాలమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల భక్తుల నామస్మరణలతో వేద పండితులు ప్రత్యేక పూజలు జరిపి ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు ఈటెల రాజేందర్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హరివర్ధన్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు బానుక నర్మద మల్లికార్జున్, ప్రముఖ వ్యాపారవేత్త మేఘ కంపెనీ డైరెక్టర్ బీ.వీ.రెడ్డి, వీఆర్ ఆస్పత్రి ఎండీ నందకిషోర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు నగేష్, నర్సింగ్‌రావు, కొమురయ్య పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలపై సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు

# పాలక మండలిలో వాడీవేడి చర్చ



పాలకమండలి సమావేశంలో రామకృష్ణ, మధుకర్‌నాయక్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** అక్రమ నిర్మాణాలకు బ్రేకు లు వేయడానికి, అక్రమార్కుల భరతం పట్టడానికి జారీ చేసే నోటీసుల విషయమై సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో వాడి వేడి చర్చ జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే కట్టడాలకు తొలుత ఓ సెక్షన్ కింద నోటీసు జారీ చేయాలని, నిర్దేశిత సమయం లోపు నిర్మాణాన్ని ఆపకపోతే మరో సెక్షన్ కింద రెండో నోటీసు జారీ చేయాలని కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రతిపాదించగా, కంటోన్మెంట్ చట్టం ప్రకారం నడుచుకోకుండా, సొంత నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదంటూ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అభ్యంతరం తెలిపారు. దీనిపై ఇరువురి మధ్య కొద్ది సేపు వాదోపవాదాలు జరిగాయి. అయితే బోర్డు అధ్యక్షుడు జో క్యం చేసుకుని సర్ది చెప్పారు. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా కమాండర్, కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశేఖర్ అధ్యక్షతన బుధవారం జరిగిన కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, సీఈఓ మధుకర్ నాయక్ తదితరులు పా ల్గొన్నారు. కంటోన్మెంట్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడానికి కంటోన్మెంట్ చట్టం సెక్షన్ 348 కింద నోటీసులు జారీ చేస్తున్నామని, అయితే అప్పటికీ నిర్మాణదారులు స్పందించకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని మధుకర్‌నాయక్ చెప్పారు. అందుకే 348 నోటీసుకు స్పందించి, నెల రోజుల్లో పని ఆపకపోతే కంటోన్మెంట్ చట్టం సెక్షన్ 332 కింద మరో నోటీసు జారీ చేద్దామంటూ ప్రతిపాదించారు. ఈ నోటీసుకు వారం రోజుల్లో స్పందన రాకపోతే కఠినంగా వ్యవహరిద్దామని చెప్పారు. దీనికి నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అభ్యంతరం తెలిపారు. ఇప్పటి వరకూ కంటోన్మెంట్ చట్టం 348 సెక్షన్ కింద మాత్రమే నోటీసు జారీ చేస్తున్నామని, 332 సెక్షన్ పేరిట సొంత నిర్ణయం తీసుకుని, నోటీసు జారీ చేయడంలో అర్థం లేదని అన్నారు. దీనిపై మధుకర్‌నాయక్ స్పందిస్తూ రామకృష్ణ అభ్యంతరాలను మినిట్స్‌లో పొందుపరచడానికి తనకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే కంటోన్మెంట్ బోర్డుకు వ్యతిరేకంగా, అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు తీసుకునే చర్యలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సభ్యునికి ఇబ్బంది కలుగుతుందన్న అంశాన్ని గుర్తు చేస్తున్నానని పేర్కొన్నారు. దీనికి రామకృష్ణ జవాబిస్తూ.. తాను కంటోన్మెంట్ బోర్డుకు వ్యతిరేకంగా, అక్రమ నిర్మాణాలను అడ్డుకునే చర్యలకు విరుద్ధంగా వ్యవహరించడం లేదని, చట్టంలోని సెక్షన్లను ప్రయోగించాలని మాత్రమే చెబుతున్నానని స్పష్టం చేశారు. అయినా.. అక్రమ నిర్మాణాలను ఆదిలోనే ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. దాంతో బోర్డు అధ్యక్షుడు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. హస్మత్‌పేట్ ట్రెంచింగ్ యార్డు స్థలాన్ని కంటోన్మెంట్ ఉద్యోగుల గృహ నిర్మాణానికి కేటాయించే అంశమై రక్షణ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు సీఈఓ వెల్లడించారు. పలు వార్డుల్లో నూతన రోడ్ల నిర్మాణం, నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, నిర్వహణ, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం, నిర్వహణ కోసం రూపొందించిన అంచనాలను పాలక మండలిలో ఆమోదించారు. మృతి చెందిన కంటోన్మెంట్ ఉద్యోగుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగం కల్పించే విషయమై చర్చ జరిగింది. ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ చేస్తున్న కంటోన్మెంట్ చీఫ్ ఇంజినీర్ గోపాలకృష్ణదాస్ స్థానంలో ఉమాశంకర్‌కు, కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ బాలకృష్ణ స్థానంలో ఫణికుమార్‌కు పదోన్నతి కల్పించాలని తీర్మానించారు. కంటోన్మెంట్ బోర్డు నిర్మిస్తున్న వర్కింగ్ ఉమెన్ హాస్టల్ తుది దశకు చేరుకున్నదని, త్వరలోనే ప్రారంభించనున్నట్టు సీఈఓ మధుకర్ వెల్లడించారు.

## జీహెచ్ఎంసీలో కదిలిన కుర్చీలు

**పాతుకుపోయినవారికి స్థానచలనం**

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్ఎంసీలో ఎన్నోఏళ్లుగా పాతుకుపోయిన డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కలిగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీలు చేయగా, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒకే స్థానంలో ఏళ్లతరబడి ఉన్న పది మందిని బదిలీ చేశారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని నియమించారు. ఏ.శైలజ, ఎండీ షేక్, డీ.సుభాష్‌రావులకు పోస్టింగ్ ఇవ్వలేదు.

| పేరు | ప్రస్తుతం పని చేస్తున్న స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| జకీయ సుల్తానా | డిప్యూటీ సీఈఓ | సర్కిల్-4, ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్ |
| ఎ.సుజాత | సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ | సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ |
| సీహెచ్.నాగేశ్వరరావు | రామగుండం, మున్సిపల్ కమిషనర్ | సర్కిల్-12, మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్ |
| జి.వేణుగోపాల్ రెడ్డి | బోడుప్పల్, మున్సిపల్ కమిషనర్ | సర్కిల్-29, సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ |
| శివకుమార్ | డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్, జీహెచ్ఎంసీ | సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ |
| ఎస్.విద్యాధర్ | గజ్వేల్, మున్సిపల్ కమిషనర్ | సర్కిల్-14, గోషామహల్ డిప్యూటీ కమిషనర్ |
| వి.సమ్మయ్య | తెల్లాపూర్, డిప్యూటీ కమిషనర్ | సర్కిల్-30, బేగంపేట డిప్యూటీ కమిషనర్ |
| ఖాదర్ మొయినుద్దీన్ | వెయిటింగ్ | సర్కిల్-15, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ |
| తిప్పర్తి యాదయ్య | ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ | సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ |
| జి.ఆంజనేయులు | డిప్యూటీ కమిషనర్, జీహెచ్ఎంసీ | సర్కిల్-2, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ |
| టి.దశరథ | సర్కిల్-4, ఎల్‌బీనగర్ డిప్యూటీ కమిషనర్ | జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్ |
| పి.రవీందర్‌కుమార్ | సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ | జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్ |
| సీహెచ్.అరుణకుమారి | సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ | జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్ |
| ఎ.నాగమణి | సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ | జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అటాచ్ |



దామోదరం సంజీవయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వి.హన్మంతరావు

## దామోదరం సంజీవయ్యను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి : వీ.హెచ్

**రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** రాజకీయ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యను నేటి తరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా బుధవారం పీవీ మార్గ్‌లోని సంజీవయ్య పార్క్‌లో గల ఆయన సమాధి వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య రెండు సార్లు ఏఐసీసీ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా ప్రజలకు నిస్వార్థ సేవ చేశారని, అంబేడ్కర్ ఆశయాలను తూచా తప్పకుండా పాటించారని, రాజకీయాల్లో అలాంటి వారు చాలా అరుదని, అయినప్పటికీ ఆయన చనిపోయే సమయానికి సొంత ఇల్లు కూడా లేదని, చివరికి ఆయన పార్థివదేహాన్ని ఆయన అత్తవారింట ఉంచాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## 'ఉస్మానియా' రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీ వేయాలి

**పంజాగుట్ట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** ఉస్మానియా ఆస్పత్రి రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని, జీవో 313ని అమలు చేయాలని ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి పరిరక్షణ గ్రూపు ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రిని పరిరక్షించాలని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రూపు ప్రతినిధులు అనురాధ రెడ్డి, డాక్టర్ జస్వీన్ జైరత్, సారా మాథ్యూస్, డాక్టర్ ఇక్బాల్ జావీద్, డాక్టర్ ఆసీఫ్ హసీఫ్ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు చేపట్టి వైద్య సేవలు కొనసాగించాలన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనాన్ని అలానే ఉంచి, ఖాళీగా ఉన్న ప్రదేశంలో అధునాతన వసతులతో కొత్త భవనం నిర్మించాలని వారు సూచించారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## లలిత కళాసమితికి త్వరలో ఎన్నికలు

**చిలకలగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** దక్షిణ మధ్య రైల్వే లలిత కళాసమితిపై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందన వచ్చింది. లలిత కళాసమితికి త్వరలో ఎన్నికలు నిర్వహించి పటిష్టమైన కార్యవర్గం ఏర్పాటు చేసి వైవిధ్య భరితమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు సమితి సంయుక్త కార్యదర్శి చాంద్ బాషా తెలిపారు. కరోనా తదితర కారణాల వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యమైనట్లు పదవీ విరమణ చేసిన వారు, మరణించిన సభ్యుల పేర్లు తొలగించి నూతన లిస్ట్ తయారు చేయటానికి అన్ని ఏర్పాట్లు గావిస్తున్నట్లు ఆఫీసు కార్యాలయం, గ్రంథాలయం నిర్వహణకి తగు చర్యలు చేపడుతున్నట్లు త్వరలో పద్య నాటక ప్రదర్శనకి ఏర్పాట్లు గావిస్తునట్లు వివరించారు. సమితి సభ్యుల సమష్టి కృషితో ఉద్యోగుల పని ఒత్తిడి దూరం చేసే విధంగా ప్రతి నెల వైవిధ్య భరిత సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## మైనర్‌ను లొంగదీసుకున్న యువకుడిపై పోక్సో, అత్యాచారం కేసు నమోదు

**తిరుమలగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** మైనర్‌ను లొంగదీసుకొని వెంట తీసుకెళ్లిన ఓ యువకుడిపై బొల్లారం పోలీసులు పోక్సో అత్యాచారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాకలో నివసించే సాయికుమార్(19)కు రిసాలబజార్‌లో నివసించే 17ఏళ్ల బాలికతో 10వ తరగతి పరీక్ష కేంద్రంలో రెండు సంవత్సరాల క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇరువురు స్నేహంగా ఉంటున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులకు తెలియకుండా బాలికను సాయికుమార్ తన వెంట తీసుకొని వెళ్లాడు. విషయం తెలియని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తార్నాకలో సాయికుమార్ వద్ద ఉంటున్న బాలికను విడిపించి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.